# ఆరోప్రాణం

ఎండలు మండిపోతున్నాయి. వేసవికాలంలో ఎండలు ఎక్కువగా ఉండడంలో విశేషమేమీ లేకపోయినా, ఆ యేటి ఎండలు మాత్రం ఎప్పటికంటే ఎక్కువగా ఉన్నాయి. పాతతరం వాళ్ళు ఏమి ఎండలు బాబూ ఇవి. నాలుగైదు పుష్కరాలు చూశాం కాని ఈ యెండలు మేమెరగం" అనడం సామాన్యమైంది. ఏ యేటికాయేడు ఆ ఎండలే ఎక్కువ అనిపించడం సహజమే అయినా, వాతావరణ శాఖ వారి ప్రకటనల ప్రకారం కూడా ఆ యేటి ఎండలు నిజంగానే ఎక్కువగా ఉన్నాయి. వార్తాపత్రికలలో ప్రతిరోజు వడదెబ్బ వల్ల చనిపోయిన వార్తలు తప్పనిసరిగా ఉంటున్నాయి.

ఆ మిట్ట మధ్యాహ్నం ఆ మామిడిచెట్టు నీడలో వాలుకుర్చీ వేసుకుని విశ్రాంతిగా నడుం వాల్చుకున్నాడు విశ్వనాధం. చుట్టుపక్కల ఎండ ఎంత తీవ్రంగా వున్నా ఆ చెట్టు నీడలో, అదిచ్చే చల్లని గాలికి ప్రాణం లేచి వస్తోందతనికి. చిన్నతనంలో తల్లి ఒడిలో ఆడుకునేటప్పుడు చెప్పలేని హాయి కలిగేది. ఆ మామిడి చెట్టుకీ తనకీ ఏమి సంబంధమోకాని, ఏ జన్మలోని అనుబంధమో కాని, దాని నీడలో కూర్చుంటే తల్లి ఒడిలో ఉన్నట్లే అనిపిస్తుంది. నిజమో, అబద్ధమో తెలియదు కాని, మనిషికి పంచప్రాణాలు ఉంటాయంటారు. ఎవరైన అతి సన్నిహితంగా ఉంటే వారిని ఆరోప్రాణం అంటారు. అదేమి విచిత్రమోకాని మనుషులలో ఆఖరికి కట్టుకున్న భార్య కూడా అతనికి ఆరోప్రాణం కాలేకపోయినా ఆ మామిడిచెట్టు మాత్రం అంతకు మించింది అయింది. ఇన్నాళ్లూ తనకి, ప్రాణాధికమైన ఆ చెట్టువల్ల ఇప్పుడు నిత్యమూ మనసుని వ్యాకులపరిచే సమస్యలు ఉత్పన్నం అవుతుండడంతో పైకి చెప్పలేని ఆవేదనని అనుభవిస్తున్నాడు విశ్వనాధం.

తల పైకెత్తి చూశాడు విశ్వనాధం. ఎటుచూసినా సూర్యకిరణాలని కూడా జారనీయనంత దట్టంగా వచ్చిన ఆకులు చెట్టునిండా ఉన్నాయి. వాటి రెమ్మలనుంచి దోరగా ఎదిగిన మామిడి కాయలు పెళ్ళి పందిరికి కట్టే పాదరసం బుడ్లలాగా వ్రేలాడుతున్నాయి. వందల సంఖ్యలో ఉన్న ఆ కాయలనీ, వాటిని మోస్తున్న ఆ చెట్టునీ చూస్తుంటే వనదేవత సంచరిస్తూ వచ్చి తనింట్లో ఆగినట్లు అనిపిస్తోంది. కాయలతో కలకల లాడే ఆ చెట్టుని చూస్తుంటే కడిపెడు పిల్లలతో కిలకిల లాడే పెద్దకూతురు జ్ఞాపకానికి వచ్చింది విశ్వనాధానికి. "ఒకరు లేక ఇద్దరు అన్న కుటుంబ నియంత్రణ నినాదం ద్దరిల్లుతున్న ఈ రోజుల్లో ఆ విషయమే పట్టించుకోలేదు ఆ దంపతులు. అమ్మాయి ఆరోగ్యానికి కాని, అల్లుడి ఐశ్వర్యానికి కాని కొరత లేకుండడం వల్ల ఆ అవసరమే కలుగలేదు వాళ్ళకి. ఆరుగురు పిల్లలతో హాయిగా ఉన్నారు వాళ్ళు.

పైనించి ఒక చిన్న మామిడి పిందె గాలికి రాలి, విశ్వనాథం మీద పడింది. ఉలిక్కిపడి కళ్ళు తెరచి చూశాడు అతను. చిన్నతనంలో తను మహా కొంటెగా ఉండేవాడు. తగని అల్లరి చేసేవాడు. పరుగు పరుగున వచ్చి అమ్మ మీద పడేవాడు. అమ్మకి బాధ కలిగి "అబ్బ ...... ఏమిట్రా వెధవ అల్లరీ నువ్వూనూ" అని కసురుకునేది కాని ఇంకేమి అనేది కాదు. కాని ముఖంలో ఆవేదన కనిపించేది. ఆ ఆవేదన వెనుక, మాటలకి అతీతమైన ఒక ఆనందానుభూతి కనిపించేది. అందుకనే అమ్మ కసురుకున్నా అందులో కోపం కనిపించేది కాదు. ఇప్పుడు తనకీ అలాగా అనిపిస్తోంది. తన పిల్లలకి తన దగ్గర చిన్నప్పటినుంచీ చనువు బాగా ఎక్కువ. వాళ్ళు చిన్నప్పుడు భుజాల మీద, తొడల మీద ఎక్కి గంతులు వేస్తూండేవాళ్ళు. ఒక్కొక్కప్పుడు అది బాధగా కూడా అనిపించేది. అయినా ఆ బాధలో కూడా ఏదో అనిర్వచనీయమైన ఆనందం ఉండేది. అందువల్ల ఆ తియ్యటి బాధని ఓర్చుకుని అమందానందం అనుభవించేవాడు. ఇప్పుడు మామడి పిందె మీద పడినప్పుడూ అటువంటి అనుభూతే కలిగింది. తిరిగి కళ్ళు మూసుకుని కాస్తంత జోగడానికి ప్రయత్నం చేశాడు. నిద్రయితే రాలేదు కాని ఆలోచనలు గతంలోకి వెళ్ళిపోయాయి.

* * *

అప్పుడు విశ్వనాథానికి పదేళ్ళుంటాయేమో, అతనికి చిన్నతనం నుంచీ మొక్కలన్నా, పూలన్నా ఎంతో ఇష్టం. ఎప్పుడూ దొడ్లోనే తిరుగుతుండేవాడు. పూర్వకాలపు కొంపేమో లంకంత ఉండేది. పెద్ద మండువా, దాని చుట్టూ వసారాలు వాటి వెనుక గదులు అంతా అట్టహాసంగా ఉండేది. ఇల్లే పెద్దది అనుకుంటే ఇంటిని మించి ఉండేది దొడ్డి. ఆ రోజుల్లో అది చిన్న ఊరు. తాతలు ఏనాడు సంపాదించారో ఏమో, పెద్ద స్థలం అది. చుట్టూ కాంపౌండ్‌వాల్ అంటూ ఉండేది కాదు. పక్కప్రక్కన ఇళ్ళున్నా మధ్య గోడలు ఉండేవి కావు. మనసుల మధ్య గొడవలుంటే కదా మనుషుల మధ్య గోడలు ఉండడానికి. అందరి దొడ్లలోనూ చిన్న అడవిలా చెట్లు గుబురుగా పెరిగి ఉండేవి. ఎవరి స్థలం హద్దులు ఎంతవరకో, దస్తావేజులు చూస్తేనేకాని ఖచ్చితంగా తెలిసేది కాదు. విశ్వనాధానికి ఒక అన్న, ఒక తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ళు ఉండేవారు. ఒకరోజున వాళ్ళ నాన్నగారు సంతకి వెళ్ళి మంచి మామిడిపళ్ళు తెచ్చారు. అవి ఎంత రుచిగా వున్నాయో చెప్పలేం. ఆ పళ్ళ రుచి వాళ్ళు మరచిపోలేకపోయారు. అందువల్ల ఆ చెట్టుని దొడ్లో పాతుకోవాలనుకున్నారు. నలుగురూ నాలుగు టెంకలు తెచ్చుకుని గుర్తుగా దొడ్లో పాతుకున్నారు. రోజూ ఆ బోదెలలో నీళ్ళు పోసేవారు. కొన్నాళ్ళకి ఆ టెంకలనుంచి మొలకలు వచ్చాయి. ఆ మొలకల్ని చూసినపుడు వాళ్ళకి కలిగిన ఆనందానికి అవధులు లేకపోయాయి. ఇంట్లో కొత్తగా పాపాయి పుడ్తే ఎంత ఆనందంగా ఉటుందో అంతటి సంబరం పడ్డారు వాళ్ళు. విశ్వనాథం మాత్రం తన మొక్కని అతి జాగ్రత్తగా నీరుపోసి, పేడ ఎరువు వేసి పెంచుకుంటుండేవాడు. మిగిలిన వాళ్ళు మొదట్లో శ్రద్ధగా పెంచినా ఆ తర్వాత ఉత్సాహం వారికి లేకపోయింది. చూసీ చూడనట్లు పెంచసాగారు వాళ్ళు. అందుకు తగినట్లుగానే అవి కూడా ఉసూరుమంటూ పెరుగుతూ, చివరకు పెరగలేక చచ్చిపోయాయి. విశ్వనాథం మొక్క మాత్రం త్వరత్వరగా పెరుగుతూ చిలవలు పలవలతో, కొమ్మలు రెమ్మలతో గుబురుగా, గున్న ఏనుగులా పెరగసాగింది. ఆ చెట్టంటే పంచప్రాణాలు విశ్వనాధానికి. అది మాత్రం నిజంగా అతనికి ఆరోప్రాణం. ఇంట్లోవున్న సమయంలో ఎక్కువసేపు ఆ చెట్టు దగ్గరే గడిపేవాడు. చదువుకున్నా అక్కడే, ఆడుకున్నా అక్కడే.

ఏణ్ణర్థం గడిచింది. విశ్వనాథం మామిడిచెట్టు ఇంతింతై, వటుడింతై అన్నట్లు ఎదుగుతున్నది

కాస్తా ఎదగడం మానేసింది. ముందు దాన్నెవరూ గమనించలేదు. ఆ తర్వాత ఆకులు రాలి పోతుండడం, రెమ్మలు పచ్చబడుతుండడం మొదలైంది. ఆకురాలు కాలంలో ఆకులు రాలిపోవడం, వెంట వెంటనే కొత్త చిగుళ్ళు రావడం మామూలే. అలా అనుకోవడానికి అది ఆకురాలు కాలమూ కాదు. కొత్త చిగుళ్ళు వచ్చిందీలేదు. కొద్ది రోజులయ్యేసరికి చెట్టు కేదో తెగులు పట్టిందని ఊహించారు వాళ్ళు. అయినా వాళ్ళు చూసీచూడనట్లు పట్టించుకోకుండా ఊరుకున్నారు. గ్రహించినవాడూ; గ్రహించలేనివాడూ విశ్వనాధం ఒక్కడే. చెట్టుకి నీళ్ళు తగ్గాయేమో ననుకొని రోజూ మరింతగా నీళ్ళు పొయ్యసాగాడు. అయినా చెట్టు నానాటికీ క్షీణిస్తుండడంతో దిగులు పట్టుకుంది అతనికి. తల్లి, తండ్రి దగ్గరకుపోయి ఆ చెట్టు విషయం చెప్పి గోలపెట్టేవాడు. వాడి గోలకి చిరాకుపడి "ఏమిట్రా ... వెధవా చెట్టుకోసం నీ గోల. దానికేదో తెగులుపట్టింది. చస్తుందో ఏమో!" అని కసురుకుంది తల్లి. ఆ మాటలు వినగానే విశ్వనాధం పసిహృదయంలో పిడుగుపడినట్లయింది. తానంతగా ప్రేమించుకున్న చెట్టు చచ్చిపోతుందేమోనని భయం వేసింది. తండ్రి దగ్గరకు పోయి ఆ చెట్టుకి ఏమైనా మందు వేయమని గగ్గోలు పెట్టాడు. తండ్రి "చూద్దాం" అని తేలిగ్గా అనేసి బయటకు వెళ్ళిపోయాడు. తమ్ముడు దగ్గరకి, చెల్లెళ్ళ దగ్గరకి పోయి ఏడుస్తూ "నా చెట్టు చచ్చిపోతోందర్రా' ' అంటూ గోల పెట్టాడు. చెట్టుకోసం విశ్వనాధం ఏడుస్తుంటే "బలేవాడివిరా నువ్వు. చెట్టు కోసం ఏడుపేమిటి? మేము పాతినచెట్లు చచ్చిపోలేదూ. మేమేమైనా ఏడ్చామా?" అన్నారు. ఇంక తనగోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాలేదు విశ్వనాధానికి.

విశ్వనాథం తండ్రి షావుకారు దగ్గర పద్దులు రాస్తుండేవాడు. ప్రొద్దున ఎనిమిది గంటలకి వెళ్ళినవాడు రాత్రి తొమ్మిది దాటితేకాని వచ్చేవాడు కాదు. మధ్యాహ్నం ఓ గంట, గంటన్నర సేపు భోజనంకోసం వచ్చేవాడు. పద్దులు రాసిరాసి అలసిపోయి ఇంటికి వచ్చి భోజనం చేశాక పడుకునేవాడు. విసుగ్గా కనిపించే ఆయన ముఖాన్ని చూస్తే ఏమాట మాట్లాడడానికి పిల్లలకి ధైర్యం ఉండేది కాదు. రోజూ పెందరాళే నిద్రపోయే విశ్వనాథం ఆ రోజు తండ్రి వచ్చేదాకా మేలుకొని ఉన్నాడు. ఆయన రాగానే ఆత్రుతగా "నాన్నా ..... నా మామిడిచెట్టుకి మందు తెచ్చావా?" అని అడిగాడు.

అసలే అలసిపోయి చిరాకుమీదున్నాడేమో ఆయన "ఫో ... వెధవా ... నాకు వేరే పని లేదనుకున్నావా?" అని కోప్పడ్డాడు. విశ్వనాదం ఇంకేదో అనబోయేసరికి కళ్ళెర్రచేసి, చెయ్యెత్తి కొట్టేంత పనిచేశాడు. అంతవరకు తండ్రి మందు తెస్తాడన్న ఆశతో వున్న విశ్వనాధానికి తండ్రి ప్రవర్తన ఆశనిపాతం అయింది. ఇంక తన మామిడిచెట్టు చచ్చిపోతుందేమోనన్న భయం పట్టుకుంది. ఏడుపు కట్టలు తెంచుకురాసాగింది. అక్కడ ఉండలేక గదిలోకి పోయి పడుకుని వెక్కి వెక్కి ఏడవసాగాడు. ఏడ్చేడ్చి ఆ ఏడుపులోనే నిద్రపోయాడు. కాని అదీ కలతనిద్రే. ఆ నిద్రలో కలలన్నీ మామిడిచెట్టు మీదే. అది చచ్చిపోయి ఎండిపోయినట్లు, దానిని తండ్రి కొట్టేస్తే ఆ కట్టెల్ని అమ్మ పొయ్యిలో పెడ్తున్నట్లు - అన్నీ పాడు కలలే. ఆ కలలతో మధ్య మధ్య ఉలిక్కిపడి లేస్తూండడం, మళ్ళీ పడుకుంటుండడం - రాత్రంతా ఈవిధంగా నడిచింది. ఆ రాత్రి పడుకునేముందు తల్లి వచ్చి పిల్లలందర్నీ చూసుకుంది. కాని విశ్వనాధాన్ని ప్రత్యేకంగా గమనించ లేదు.

విశ్వనాధానికి మామూలుగా తెల్లవారకుండానే నిద్రలేవడం అలవాటు. అటువంటిది మర్నాడు ప్రొద్దున ఏడుగంటలు కావస్తున్నా అతను నిద్ర లేవలేదు. అతన్ని నిద్ర లేపుదామని తల్లి వచ్చి వంటిమీద చెయ్యి వేసింది. ఒళ్ళు వేడితో పేలిపోతోంది. "అబ్బా .... వీడికి ఇంత జ్వరం వచ్చిందేమిటి?" అనుకొని అతన్ని నిద్రలేపి "మొహం కడుక్కో బాబు. మందు వేసుకొందుగాని" అంది. విశ్వనాధం

లేచి మొహం కడుక్కోడానికి దొడ్లోకి వెళ్ళగానే, ఆమె భర్త దగ్గరికి వెళ్ళి " ఏమండీ ..... విస్సిగాడికి ఒళ్ళు పేలిపోతోంది" అంది.

"ఊ ...... అల్లరివెధవ .... చెట్టూపుట్టా పట్టుకు తిరుగుతాడు. జ్వరం రాకుండా ఎలా వుంటుందీ? జీలకర్ర కషాయం కాచియ్యి. అదే తగ్గుతుంది" అని మామూలుగా అనేసి ఊరుకున్నారు. తర్వాత తన పనిలోకి వెళ్ళిపోయాడు.

భర్త చెప్పినట్లే విశ్వనాధానికి కషాయం కాచిచ్చింది ఆమె. కాని అందువల్ల గుణం ఏమీ కనిపించలేదు. అన్నం ఎలాగూ లేదు. కనీసం జావ కూడా త్రాగలేకపోయాడు. బలవంతాన త్రాగబోయినా నోటికెక్కలేదు. పైగా వాంతి అయింది. "లంఖణం పరమౌషధం" అన్నట్లుగా రెండుపూటలు పొట్ట మాడిస్తే అదే తగ్గుతుంది అనుకుని ఆమె ఊరుకుంది.

విశ్వనాధం నీరసంగా పడుకున్నాడు. అతని ఆలోచనలన్నీ ఆ మామిడి చెట్టుమీదే. అవతలకి వెళ్ళినప్పుడల్లా ఆ మామిడిచెట్టుని చూసుకొని రాసాగాడు. దాన్ని చూసినప్పుడల్లా అతనికి కళ్ళనీళ్ళు రాసాగాయి. తల్లికళ్ళముందు పిల్ల చనిపోతోంటే, తల్లి ప్రాణం తల్లడిల్లినట్లు కొట్టుకోసాగింది అతని మనసు. అసహాయంగా తిరిగి వచ్చి మంచంమీద పడుకొని తనలో తానే కుమిలిపోసాగాడు.

ఆ రాత్రి విశ్వనాధానికి జ్వరం బాగా ఎక్కువైంది. మనిషి మగతలో ఉండి నిలిచినా పలకని స్థితితో ఉన్నాడు. తనలో తనే పలవరింతలు. రాత్రి ముదురుతున్న కొద్దీ పలవరింతలు ఎక్కువ అయ్యాయి. ఆ పలవరింతలలో అస్పష్టత తగ్గి స్పష్టత ఎక్కువ కాసాగింది. "అమ్మా ..... నాన్నా .... నా మామిడి చెట్టు చచ్చిపోతోంది. దానికి మందేయండి" అంటూ ఒకటే పలవరింతలు.

"ఏమిటీ....వీడు చెట్టుకోసం ఇంత బెంగ పెట్టుకున్నాడు." అని ఆశ్చర్యంతోపాటు ఆవేదన పొందాడు తండ్రి. బెంగతో పిల్లవాడు ఏమైపోతాడో అని దిగులు పట్టుకుంది తల్లికి. విశ్వనాధానికి మెలకువ వచ్చినప్పుడు "బాబూ .... దిగులు పడకు. రేపే మామిడి చెట్టుకు మందు వేయిస్తాం. అది బతుకుతుంది" అని తల్లీ తండ్రి నచ్చచెప్పసాగారు.

అన్నప్రకారం మర్నాడు ప్రొద్దున్నే విశ్వనాధం తండ్రి అగ్రికల్చరల్ అసిస్టెంట్ ఇంటికి వెళ్ళి స్వయంగా ఆయన్ని ఇంటికి తీసుకువచ్చాడు. ఆయన ఆ మామిడిచెట్టుని పరీక్షించి దానికేదో తెగులు సోకిందని చెప్పి ఫలాన మందులు కొని ఫలానా విధంగా వాడండి అని చెప్పాడు. అది విని "బాబ్బాబూ .... అదేదో .... మీరే చేయండి. ఆ ఖర్చులు నేను పెట్టుకుంటాను. మీ రుణం ఉంచుకోను. మేమైతే సరిగ్గా ఆ మందులూ అవీ వేయగలమో లేమో?" అన్నాడు విశ్వనాధం నాన్న.

"సర్లెండి, ఒక ఇరవై రూపాయలు ఇయ్యండి ఆ మందులు తెస్తాను" అని చెప్పి ఆ డబ్బు తీసుకొని వెళ్ళిపోయాడు అసిస్టెంట్.

వెధవ ఒక మామిడిచెట్టు కోసం ఇరవై రూపాయలు ఖర్చుపెట్టడమంటే నిజానికి ఆయనకి మనసొప్పలేదు. కాని పిల్లవాడు ఏమైపోతాడోనన్న భయంతో ఆ డబ్బు ఇచ్చాడు.

అగ్రికల్చరల్ అసిస్టెంట్ వచ్చి తన మామిడి చెట్టుని పరీక్షిస్తుంటే, ప్రమాదస్థితిలో వున్న పిల్లవాడిని స్పెషలిస్టు డాక్టరు వచ్చి పరీక్ష చేస్తుంటే తలిదండ్రులకి కలిగేటంత ధైర్యం కలిగింది విశ్వనాధానికి.

మరో గంటలో వచ్చి మందులు చల్లాడు ఆ అగ్రికల్చరల్ అసిస్టెంటు. ముందు చెట్టు చుట్టూతా నేలకి గొయ్యి చేశాడు.

కొన్ని వేళ్ళను కొంతవరకు నరికాడు. ఆ తర్వాత ఏదో మందు నీళ్ళలో కలిపి చెట్టు చుట్టూతా

పోసి మట్టి కప్పాడు. ఆ తర్వాత ఇంకేదో మందుని బాల్చీనీళ్ళలో కలిపి స్ప్రేయర్‌తో చెట్టు కాండం మీదా, కొమ్మల మీదా, ఆకుల మీదా బాగా చల్లాడు. వారం తర్వాత ఇంకోసారి మందు చల్లుతానని చెప్పివెళ్ళాడాయన.

విశ్వనాధానికి సగం దిగులు తగ్గింది. ఇంక పరవాలేదనే ధైర్యం వచ్చింది. ఇంత చేసినా ఆ చెట్టు చచ్చిపోతుందేమోనన్న భయం ఒక ప్రక్కన లేకపోలేదు. ఏది ఏమైనా ఆయనవచ్చి వెళ్ళాక విశ్వనాధానికి జ్వరం తగ్గకపోయినా, పలవరింతలు తగ్గాయి. డాక్టర్‌ని పిలిచి అతనికి మందులిప్పించసాగాడు విశ్వనాధం తండ్రి.

నాలుగు రోజులు గడిచాయి. విశ్వనాధం జ్వరం క్రమేపి తగ్గుతోంది. మామిడిచెట్టుకి కొత్త చిగుళ్ళేమీ కనిపించలేదు. కాని, ఆకులు రాలిపోవడం ఆగింది. పచ్చబారుతున్న కొమ్మలు, పసుపు బారడం ఆగి మళ్ళీ గోధుమరంగులోకి రాసాగాయి.

మరో మూడు రోజుల తర్వాత అగ్రికల్చరల్ అసిస్టెంటు తిరిగివచ్చాడు. అనుభవజ్ఞుడైన వైద్యుడు, రోగిని చూస్తూనే రోగాన్ని గుర్తించినట్లు, ఆయన ఆ మామిడిచెట్టును చూస్తూనే దాని తెగులు తగ్గిందని చెప్పగలిగాడు. అంతేకాదు చురుకైన ఆయన కళ్ళకి తలలు పైకి ఎత్తుతున్న కొత్త చిగుళ్ళు కనిపించాయి. ఇంక ఫర్వాలేదండీ, మీ మామిడిచెట్టు బతికింది. "ఇదుగో ... కొత్త చిగుళ్లు కూడా వేస్తోంది." అని చూపించి మళ్ళీ చెట్టుపైన మందులు చల్లి వెళ్ళాడు.

ఆ మాటలు వింటుంటే గుండెలమీద కుంపటి దిగినట్లనిపించింది. విశ్వనాధం తల్లిదండ్రులకి. ఇంక అతని ఆనందం గురించి చెప్పడానికి వీలులేదు.

అగ్రికల్చరల్ అసిస్టెంటు చూపించిన కొత్త చిగుళ్ళవంక ఆసక్తిగా చూశాడు. మామిడిచెట్టు కాండాన్నీ, కొమ్మల్నీ ప్రేమగా నిమిరాడు.

మామిడిచెట్టు కొత్త చిగుళ్లు నెమ్మది నెమ్మదిగా పైకి వచ్చి త్వరత్వరగా ఎదగసాగాయి. అంతకన్నా వేగంగా విశ్వనాధం జ్వరమూ తగ్గిపోయింది. ఆ తర్వాత త్వరలోనే మామిడిచెట్టు చక్కగా కొమ్మలూ, రెమ్మలతో గుబురుగా ఎదగసాగింది. చచ్చి బ్రతికిన చెట్టేమో, అదంటే విశ్వనాధానికి మరింత ప్రేమ ఏర్పడింది. అదంటే కొడుకుకి ఉన్న అప్యాయతను గుర్తించిన తలిదండ్రులూ, ఇతరులూ కూడా దానిపట్ల శ్రద్ధ చూపసాగారు.

* * *

ఏళ్ళు గడచిపోయాయి. విశ్వనాధం తల్లీ, తండ్రీ చనిపోయారు. తమ్ముడు ఉద్యోగం చేస్తూ వేరే ఊరికి వెళ్ళిపోయాడు. చెల్లెళ్ళకి పెళ్ళయి అత్తవారిళ్ళలో కాపురాలు చేసుకుంటున్నారు. తానూ ఓ యింటివాడయి నలుగురు బిడ్డల తండ్రి అయ్యాడు. పెద్దమ్మాయికి పెళ్ళిచేసి అత్తవారింటికి పంపాడు. రెండో అమ్మాయి పెళ్ళికి ఎదిగి ఉంది. మిగిలిన ఇద్దరూ అబ్బాయీ, అమ్మాయి .... చదువుకుంటున్నారు. తాతలనాటి ఆస్తి ఇంకా కాస్తో కూస్తో ఆ ఊళ్ళోనే ఉండడంతో, అక్కడే వుండి గుట్టుగా కాలక్షేపం చేస్తున్నాడు విశ్వనాధం.

ఈ మూడు దశాబ్దాలలో రోజులు ఎంతగానో మారిపోయాయి. పల్లెటూళ్ళమీదకూడా బస్తీల ప్రభావం బాగా పడింది. పల్లెలలో వెనుకటి రోజుల్లో ఉన్నటువంటి అప్యాయతలూ, అభిమానాలూ అంతకంతకీ అంతరించి పోసాగాయి. మనుషులు ఎంతసేపూ అంటీ ముట్టనట్లుగా ఉంటూ, పూర్తిగా డబ్బుకి విలువ ఇచ్చేవారిగా మారిపోయారు.

విశ్వనాధం ఇంటి ప్రక్క స్థలం రాజారావుది. విశ్వనాధం తండ్రీ, రాజారావు తండ్రీ బ్రతికివున్న

రోజుల్లో ఒకే కుటుంబం వారిలాగా అన్యోన్యంగా వుండేవారు. రాజారావు పట్నంలో చదువుకుంటుండేవాడు. కొద్ది నెలల క్రితమే అతని తండ్రి చనిపోయాడు. దాంతో ఏకైక పుత్రుడైన అతను తండ్రి ఆస్తికి వారసుడు అయ్యాడు. పట్నంలో చదువుకున్న అతనికి కోళ్ళ ఫారాలు, డైరీ ఫారాలు పెట్టాలని సంకల్పం కలిగింది. అందువల్ల ఉన్న ఊళ్ళో సొంత స్థలంలో వాటిని ఏర్పాటు చెయ్యాలనుకున్నాడు. దాంతో విశ్వనాథం స్థలానికీ, తన స్థలానికీ మధ్య సరిహద్దు నిర్ణయించుకోవలసిన అవసరం ఏర్పడింది.

ఒకరోజున రాజారావు తన దస్తావేజులు తీసుకువచ్చి, తన ఆలోచనలు చెప్పి ఇద్దరి సరిహద్దులూ నిర్ణయించుకుందామని విశ్వనాథంతో చెప్పాడు. దానికేం లెమ్మని విశ్వనాథం తన దస్తావేజులు తీసుకు వచ్చాడు. అదేం దురదృష్టమోకాని, విశ్వనాథం ఆరోప్రాణంగా పెంచుకున్న మామిడిచెట్టు, ఇద్దరి స్థలాల మధ్యన గల సరిహద్దు మీద ఉంది. అంతవరకు ఆ విషయాన్ని గమనించిన వారెవరు లేరు. అన్నాళ్ళూ ఆ చెట్టుమీద వచ్చే ఫలసాయాన్ని విశ్వనాథం కుటుంబమే అనుభవిస్తూ వచ్చింది. అయితే పల్లెటూళ్ళలో సాధారణంగా జరుగుతుండే విధంగా దాని కాయలనీ, పళ్ళనీ ఇరుగు పొరుగుకీ తెలిసిన వారికీ పంచుతూండేవారు. అందరూ ఆ చెట్టు విశ్వనాథంది అనే అనుకునేవారు.

ఎప్పుడైతే ఆ మామిడిచెట్టు సరిహద్దు మీద వున్నట్లు తెలిసిందో అన్నాళ్ళూ వున్న స్నేహాన్ని మరచిపోయి పేచీకి దిగాడు రాజారావు. అన్నాళ్ళూ విశ్వనాథం దానిమీద అనుభవించిన ఫలసాయంలో తనకి సగం వాటా రావాలంటాడు. ఆ చెట్టు తాను వేసుకున్నాననీ, ప్రాణపదంగా పెంచుకున్నాననీ విశ్వనాథం ఎంత నచ్చచెప్పినా వినిపించుకోలేదు. లేదా ఆ చెట్టు కొట్టేయిస్తే, నేను గోడ పెట్టుకుంటా అంటాడు రాజారావు. చెట్టుని కొట్టడం అంటే ప్రాణం పోయినట్లే అనిపించింది విశ్వనాథానికి.

ఈ వివాదాన్ని ఊరి పెద్దల వద్దకు తీసుకెళ్ళాడు విశ్వనాథం. వాళ్ళకి విశ్వనాథం సంగతి బాగా తెలుసు కనుక రాజారావుకి నచ్చచెప్పాలని ఎంతో ప్రయత్నించారు. కాని అతడు ససేమిరా వినలేదు. పైగా కోర్టుకి వెళ్తానని బెదిరించాడు. కోర్టుకి వెళ్ళే స్థోమత విశ్వనాథానికి లేదు. పైగా కోర్టుకి పోయాక, ఎప్పటికి, ఏవిధంగా తీర్పు వస్తుందో ఎవరూ చెప్పలేరు. ఏదో విధంగా సర్దుబాటు చేసుకోవాలనే అతని తాపత్రయం.

"రాజారావు ఈ చెట్టును నేను వేసుకున్నాను. ఇన్నాళ్ళు అందరిలాగా అది మాదేనని అనుకుంటూ వచ్చాను. అయిందేదో అయిపోయింది. పచ్చనిచెట్టుని కొట్టాలనే ఆలోచన వదిలేయి. ఇంకముందు దానిమీద వచ్చే ఫలసాయాన్ని సమానంగా అనుభవిద్దాం. నీవేపు కాయలు నీవు తీసుకో, నా వేపు కాయలు నేను తీసుకుంటా" అని నచ్చచెప్పాలని ప్రయత్నించాడు.

కాని రాజారావు మొండిపట్టుదల పట్టాడు. "ఇవన్నీ ఎవరు చెప్పగలరు? నీవేపు ఎక్కువ కాయొచ్చు. నావేపు తక్కువ కాయొచ్చు. మేము చూడకుండా మీరు కాయలు కోసుకోవచ్చు. ఇవన్నీ జరిగేవి కావు. ఈ తగాదా తేలాలంటే ఒక్కటేమార్గం. ఆ చెట్టుని కొట్టించివేస్తా. ఇన్నాళ్ళూ నువ్వు నా బదులు అనుభవించిన ఫలసాయం బదులుగా, ఆ కలపని అమ్మిన డబ్బును నేను తీసు కుంటా" అంటూ మొండికెత్తాడు. అతను అంత మొండికెత్తడానికి కారణం కాయలతో పచ్చగా ఉన్న ఆ చెట్టుని చూస్తే అసూయతో కళ్లు కుట్టడమే.

"రాజారావుకు చెట్టుని కొట్టడం మాట వదిలిపెట్టి వేరే ఏదైనా చెప్పు. ఆ చెట్టుని కొట్టడం జరిగితే నేను బ్రతకను. దానికీ నాకూ ఉన్న సంబంధం నీకు తెలియనది కాదు. లేదా నీకిష్టమయితే ఒక పనిచేయి. నీది ఎలాగూ ఖాళీస్థలమే కనుక, ఆ మామిడిచెట్టు ఉన్నమేరకు నిలువుగా స్థలాన్ని నాకు అమ్ము. అప్పో, సొప్పో చేసి స్థలాన్ని నేను కొంటా" అన్నాడు విశ్వనాథం ప్రాధేయపూర్వకంగా.

"ఇది మరీబాగుంది. నా పౌల్ట్రీఫారంకే స్థలం చాలదని నేననుకుంటుంటే, నా స్థలాన్నే అమ్మమంటావా? సరే ఆలోచన చెప్పావు కనుక నేనూ ఒక సలహా చెప్తాను. ఆ మామిడిచెట్టు ఉన్న మేరకు నీ స్థలాన్ని నాకు అమ్ము. అక్కడ గోడకట్టవలసిన అవసరం ఉండదు గనుక చెట్టును కొట్టను. అయితే ఇన్నాళ్ళూ నీవనుభవించిన ఫలసాయానికి బదులు ఆ చెట్టుకేమీ ఖరీదు కట్టను. స్థలం గజం ఐదు రూపాయల చొప్పున కొంటాను నీ కిష్టమైతే సరే, లేదా చెట్టును కొట్టక తప్పదు" అని ఖండితంగా చెప్పాడు రాజారావు. నిజానికి అక్కడ స్థలం కనీసం గజం ఇరవై రూపాయలు చేస్తుంది. కాని విశ్వనాధానికి ఆ చెట్టుపై ఉన్న అభిమానాన్ని సొమ్ముగా చేసుకోవాలనుకొన్నాడు రాజారావు.

"సరే రాజారావు. ఈ రోజు బాగా ఆలోచించి చెప్తా" అని కన్నీళ్ళతో వెళ్ళిపోయాడు.

ఆరాత్రి విశ్వనాధికి నిద్రపట్టలేదు. తను అన్నాళ్ళు పెంచిన చెట్టును కొట్టేస్తే ఎలా ఒప్పుకోగలడు? భార్యని, పిల్లల్నీ కూడా సలహా అడిగాడు అతను. అతనికి, ఆ చెట్టుకి ఉన్న అనుబంధం గురించి ఎవరికి తెలుసు? తెలిసినా అర్థం చేసుకోగల వారెవరు? "కోర్టు తగాదాలెందుకునాన్నా? చెట్టు పోతే పోయింది. చెట్టుకోసం స్థలం చవగ్గా వదులుకుంటామా?" అని అన్నారు పిల్లలు.

"అమ్మకోదలచుకుంటే స్థలాన్ని ఎంతో కొంతకి అమ్మకోండి. ఎలాగూ చిన్నదానికి పెళ్ళి ఖాయం అయినట్లే కదా? డబ్బుకి వెతుక్కుంటున్నాం. పోనీ ఈరూపేణా డబ్బు అందు తుంది" అంది భార్య

"అవును కూతురిని ఎంతో ప్రేమగా పెంచాక అత్తవారింటికి పంపక తప్పదు. పిల్ల ఎక్కడయినా క్షేమంగా ఉంటే చాలనే తండ్రి భావిస్తాడు. ఇప్పుడు మామిడిచెట్టు కూడా అంతే. ఇన్నాళ్ళూ నాబిడ్డకంటే ఎక్కువగా, నా ఆరోప్రాణంగా పెంచుకున్నానీచెట్టుని. ఈ చెట్టుని ఇన్నాళ్ళకి వేరేవారి పరం చేయాల్సి వస్తోంది. పోనీ అక్కడైనా అది పచ్చగా ఉంటే చాలు. ఇన్నాళ్ళు తన కాయలూ, పళ్ళతో నా రుణం తీర్చుకుంది. ఇప్పుడు పరాయిసొత్తు అవుతూ నా బిడ్డ పెళ్ళికి పరోక్షంగా సాయపడుతోంది. తప్పదు. నేనా చెట్టుని రాజారావు పరం చేయక తప్పదు" అని నిర్ణయానికి వచ్చాడు విశ్వనాధం.

మర్నాడే వెళ్ళి రాజారావుకి తన నిర్ణయం తెలిపి స్థలం అమ్మకానికి పెట్టాడు. అయితే దస్తావేజులో మాత్రము "మామిడిచెట్టు ఎట్టి పరిస్థితులలోను కొట్టను" అనే షరతు రాయించాడు. ఆ షరతుకి రాజారావు కూడా సంతోషంగా ఒప్పుకున్నాడు. కాయలు, పళ్ళనీ ఇచ్చే పచ్చనిచెట్టుని కావాలని కొట్టుకునేంత మూర్ఖుడు కాదు రాజారావు.

అన్నాళ్ళూ, పెంచుకున్న మామిడిచెట్టును చివరిసారిగా ఆప్యాయంగా తడిమి, దస్తావేజులు రాజారావు కప్పచెప్పి తిరిగి వచ్చాడు విశ్వనాధం.

ఆ తరువాత మళ్ళీ అతను వీధి ముఖం చూసింది లేదు.

*(భారతి - డిసెంబర్ 1983)*